




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 11 మార్చి 2026

పేజీలు 8






# ప్రతి ఇంట్లో

## సూర్యఘర్ వెలుగులు నింపుదాం..

**పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలి**

**సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా జనజాగృతికి శ్రీకారం**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా, మార్చి 10, మేజర్ న్యూస్ :** సౌరశక్తి వినియోగంపై ప్రజలను ప్రోత్సహిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదామని.. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ) – సూర్యాంధ్ర ప్రగతి రథ శకటాలను కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి లభించడంతో పాటు పర్యావరణ హిత జీవితానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో అమల్లో ఉన్న పీఎం సూర్యఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా 60 శాతం వరకు రాయితీతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వినియోగదారులు ఉత్పత్తిదారులుగా మారొచ్చన్నారు. ఇంటి అవసరాలకు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ స్వయం మిగతా 2లో...

# ఇఫ్తార్ విందు



విందులో ఎమ్మెల్యే బొండా, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా

వివరాలు 2లో...

# తిరువూరు అభివృద్ధికి ఎంపీ బాటలు



**నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.8.70 కోట్ల సాస్కీ నిధులు విడుదల**

**నిధుల మంజూరుకు ఆర్ అండ్ బి శాఖా మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని కలిసి కృషి చేసిన ఎంపీ కేశినేని శివనాథ్**

**ఎంపీ విజ్ఞాపనకు స్పందించి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం**

**తిరువూరు నియోజకవర్గం కు అత్యధిక నిధులు కేటాయింపు**

ఎన్టీఆర్ జిల్లా మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బాటలు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి 2

స్వయం సహాయక సంఘాల మహిళలకు

# చేయూత అందించాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



వివరాలు 2లో..

(మొదటిపేజీ తరువాయి)



## ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదాం..

సమృద్ధితో విద్యుత్ కొనుగోలుపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి యజమానులు, అపార్టుమెంట్లు, హౌసింగ్ సొసైటీలు, చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు, రైతులు పథకానికి అర్హులని వివరించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎస్ఈఎఫ్ఐ – సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ రథం ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని, ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మార్గనిర్దేశనంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్ తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. తిరువూరు ప్రాంత అభివృద్ధిపై, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంబంధిత రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని పలుమార్లు కలిసి విజ్ఞాపనలు అందజేశారు. గత సంవత్సరం నవంబర్ 25వ తేదీన మంత్రి బిసి జనార్ధన రెడ్డిని సచివాలయంలో కలిసిన ఎంపీ కేశినేని చిన్ని నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై చర్చించి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో ప్రస్తుత రహదారులు, వంతెనల పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధాన మార్గాలు, వంతెనల మరమ్మతుల అవసరాన్ని వివరించారు. ప్రజలకు సులభ రవాణా సౌకర్యం అందించాలంటే తక్షణమే రహదారుల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రోడ్లు కీలకమని, త్వరితగతిన పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అప్పట్లో మంత్రిని సచివాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రహదారుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషితో తాజాగా నియోజక వర్గంలో పలు అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.8.70 కోట్ల సాస్కీ నిధులను మంత్రి జనార్దన్ రెడ్డి మంజూరు చేస్తూ ప్రభుత్వపరంగా జీవో జారీ చేశారు. దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు ఆర్ అండ్ బి శాఖ ద్వారా మంజూరు చేసినట్లు ఎంపీ కేసినేని శివనాద్ ( చిన్ని) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎం.డి.ఆర్ అండ్ ఎస్.హెచ్ ప్రపోజల్స్ అప్‌గ్రేడేషన్ల కింద, రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మెరుగుదలకు సంబంధించి నిధుల విడుదల చేస్తూ ప్రభుత్వ పరంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల కంటే తిరువూరు నియోజకవర్గానికి అత్యధికంగా రూ. 8.70 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. మంజూరైన పనుల వివరాలు: 1. రూ.2.10 కోట్ల నిధులతో నందిగామ–పుట్రేల రోడ్డు, శ్రీరామ్‌పురం– పేరువంచ రహదారులను అభివృద్ధి చేయడం, 2. రూ. 2.20 కోట్ల వ్యయంతో తిరువూరు – తునికిపాడు రహదారి అభివృద్ధి, 3. రూ. 2.40 కోట్ల నిధులతో శ్రీనికేతన్ – కొత్తపల్లి రహదారి, కొత్తపాడు – కాకర్ల రోడ్డు అభివృద్ధి, 4. రూ. 30లక్షల వ్యయంతో కోటపాడు – కాకర్ల రోడ్డు అభివృద్ధి

## రంజాన్ ఇఫ్తార్ విందు

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** మంగళవారం సాయంత్రం 5:40 గంటలకు సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్ సుందరయ్య నగర్ పార్క్ పక్కన ఉన్న నూరియే మహమ్మాధియా మసీదులో నిర్వహించిన రంజాన్ మాసం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ షేక్ నాగుల్ మీరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తూ అల్లాహ్‌ను ప్రార్థిస్తారని తెలిపారు. సమాజం, రాష్ట్రం, దేశం, సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మైనార్టీ సోదరులకు



ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.. అలాగే గతంలోనూ ఈ మసీదుకు తాము సహాయం అందజేశామని గుర్తుచేసుకుంటూ, ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన స్థానిక కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు షేక్ గౌస్ భాషా, షేక్ సుబాని, లబ్బా వైకుంఠం, కొలాశ్రీను, మేహేరుద్దిన్, జానీబాషా, జాన్ వలి, ఖబిర్,బడేబాజీ, దస్తాగిర్, స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరువూరు అభివృద్ధికి ఎంపీ బాటలు

5. రూ. 30లక్షల వ్యయంతో గంపలగూడెం – గోసవీడు రహదారి అభివృద్ధి, 6. రూ. 25 లక్షల వ్యయంతో ఎంఎన్‌కె రోడ్డు – పోలవరం రోడ్డు అభివృద్ధి, 7. రూ. 25లక్షల వ్యయంతో మారెపల్లి – కొత్తూరు (వయా) గున్నచింతలపాడు రహదారి అభివృద్ధి, 8. రూ. 25లక్షల వ్యయంతో విస్సన్నపేట –లక్ష్మీపురం రోడ్డు నుంచి తెల్లాడవారపల్లి – అమ్మపాలెం రోడ్డు అభివృద్ధి, 9. రూ. 20లక్షల వ్యయంతో పుట్రేల – కుంచిపర్తి (వయా) నర్మదానగర్ రహదారి అభివృద్ధి, 10. రూ. 10లక్షల వ్యయంతో టిటి రోడ్డు – టిఆర్ రోడ్డు ( లింకు రోడ్డు ) అభివృద్ధి, 11. రూ. 35లక్షల వ్యయంతో చెన్నవరం – మల్లవరం రహదారి అభివృద్ధి, మొత్తంగా 11 రహదారులకు



కలిపి సుమారుగా 63 కిలో మీటర్ల మేర అభివృద్ధికి గానూ రూ.8.70 కోట్ల మేర నిధులను తిరువూరు నియోజకవర్గంకు కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సంబంధిత మంత్రి జనార్దన్ రెడ్డి గార్లకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివ నాథ్ ( చిన్ని ) ధన్యవాదాలు తెలిపారు. నిధుల కేటాయింపుతో రహదారుల సత్వర అభివృద్ధి జరిగి ప్రజలకు మేలు చేకూరుతుందని, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వపరంగా నిధులు కేటాయింపుల ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు సమకూరనున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య రంగాలకు రహదారుల నిర్మాణంతో పురోగతి సాధ్యపడుతుందని, పార్లమెంటు నియోజకవర్గ పరిధి లోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు...

# స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత అందించాలి

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసి చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనుగోలుదారులకు పిలుపునిచ్చారు.మంగళవారం ఉదయం తాడిగడప మున్సిపాలిటీ కానూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో" కొనుగోలుదారులు... అమ్మకందారుల సమ్మేళనం' పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో జిల్లాలో పలువురు స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసి ప్రదర్శనకు ఉంచిన వివిధ అకాల ఆహార ఉత్పత్తులు, వస్త్రాలు, పారిశుద్ధ్య ద్రవ పదార్థాలు, ఆకు పళ్ళెములు తదితర గృహోపకరణ వస్తువులు,సామాగ్రి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియం లో మొత్తం 197 ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయగా, మహిళా వ్యాపారవేత్తలు కొనుగోలుదారులతో కళకళలాడింది. జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా ప్రతి ప్రదర్శనశాల వద్దకు వెళ్లి మహిళలు తయారు చేసిన వస్తువుల ధరలు, తయారీకి అయ్యే ఖర్చు, మార్కెటింగ్ ఎలా చేస్తున్నారు, వారికి వచ్చే ఆదాయం తదితర వివరాలు, సమ్మేళనంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయం మేరకు ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనే నినాదంతో జిల్లాలోని స్వయం సహా సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి పరిచేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో నిజంగా జీవితంలో పైకి ఎదగాలనే తపన, కష్టపడే మనస్తత్వం కలిగిన 500 మందిని గుర్తించామని అందులో 300 మందికి ప్రభుత్వ సహకారంతో పాటు పలు పథకాల కింద బ్యాంకు రుణాలు మంజూరు చేయించి వివిధ రకాల యూనిట్లు స్థాపించడానికి తోడ్పాటు అందించామన్నారు. ఇదివరకు వారు తయారు చేసిన ఉత్పత్తులు ఎక్కడ అమ్మాలో తెలియక సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండేవారన్నారు. వారి వ్యాపారం సుస్థిరంగా ఉండాలంటే వారికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో కొనుగోలుదారులు అమ్మకందారుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమ్మేళనం ద్వారా మంచి ఆహార ఉత్పత్తులు సమీపంలో ఎక్కడున్నాయో కొనుగోలుదారులకు తెలిసే అవకాశం లభించిందన్నారు. తక్కువ ధరలో ఉత్పత్తులు రవాణా ఖర్చులు లేకుండా వారికి లభ్యమవుతాయన్నారు. నాణ్యతగా ఉన్న ఆహార ఉత్పత్తులను కొనుగోలుదారులు హోటల్ యజమానులు కొనుగోలు చేయడంతో పాటు వాటి ఫోటో తీసుకుని వారికి తెలిసిన వారందరికీ షేర్ చేస్తూ కూడా విస్తృతంగా తెలియజేయాలన్నారు.

నాణ్యత విషయంలో గానీ ఇతర ఏమైనా లోటుపాట్లు ఉంటే ఉత్పత్తిదారులకు సూచనలు కూడా ఇవ్వాలన్నారు. జిల్లా యంత్రాంగం పిలుపుమేరకు వచ్చిన కొనుగోలుదారులం దరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అమృత కృష్ణా పేరుతో ప్లాస్టిక్ ను నివారించే ఉద్దేశంతో గాజు సీసాలతో మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎవరైనా సరే అవసరము ఉన్నవారు మంచినీటినీ కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలుదారులను మహిళ వ్యాపారవేత్తలు సంప్రదిస్తే వారికి కావలసిన సహకారం అందించాలన్నారు. పెద్ద పెద్ద కొనుగోలుదారుల నుండి ఏమైనా ఆర్డర్లు వస్తే మహిళా వ్యాపారవేత్తలు వారి శక్తి సామర్థ్యాలకు మించకుండా నాణ్యత లోపం లేకుండా ఉత్పత్తులు సరఫరా చేయాలన్నారు. చెప్పిన సమయానికి నాణ్యత గల ఉత్పత్తులు సరఫరా చేసే విధంగా మహిళా వ్యాపారవేత్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ వి స్వామి మాట్లాడుతూ హోటల్ యజమానులు అందరూ ఐకమత్యంగా ఉంటామన్నారు. జిల్లా కలెక్టర్ తొలిసారిగా ఇటువంటి సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. మహిళా వ్యాపారవేత్తలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు పివి రమణ మాట్లాడుతూ హోటల్లలో ఉలవచారు తప్పకుండా వాడతామని సమ్మేళనంలో ఉంచిన ఉలవచారు కూడా గమనించి కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకునీ కొనుగోలుదారులకు అమ్మకందారులకు ప్రత్యేకంగా సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త అనే నినాదానికి తమ వంతు సహకారం తప్పకుండా అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కోరిన మీదట తమకు కావలసిన మంచినీటి సీసాలను కృష్ణ కలెక్టరేట్ నుండి కొనుగోలు చేస్తామన్నారు.

వాణి స్వీట్స్ అధినేత క్యాటరింగ్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం రూపొందించిన వివిధ ఉత్పత్తుల ధరల కేటలాగు చాలా బాగుందని ఏదైనా ఒక యాప్ ద్వారా డిజిటల్ చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యతగా ఉంటే తాము కొనుగోలు చేస్తామని ఆ నాణ్యత నిరంతరం కొనసాగాలన్నారు. జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జిబివి రవికుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సమ్మేళనం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకం అన్నారు. తమ సంఘం భవనంలో కూడా ఇటువంటి కార్యక్రమం నిర్వహించాలని చక్కగా వ్యాపారం జరుగుతుందని చెప్పారు. అనంతరం మహిళా వ్యాపారవేత్తలు సత్యవతి, సుష్మ తాము ఎలా వ్యాపారం మొదలు పెట్టి అభివృద్ధి చేశాము మిఠాయిలు, తినుబండారాలు, ఎంబ్రాయిడరీ, చేనేత వస్త్రాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కల్పన, డిఆర్ఓ చంద్రశేఖర రావు, ఉయ్యూరు ఇన్చార్జ్ ఆర్డిఓ కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, డి ఆర్ డి ఏ పి డి హరిహరనాథ్, డి ఐ సి జి ఎం వెంకటరావు జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు,, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, డి టి డబ్ల్యూ ఫణి ధూర్జటి, మార్క్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, జిల్లా ఉద్యాన అధికారి జే.జ్యోతి, ఎల్డిఎం రవీంద్రారెడ్డి, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, ఆహార తనిఖీ అధికారి గోపాలకృష్ణ, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్, సంయుక్త కార్యదర్శి ఈమని దామోదర్ రావు పలువురు పారిశ్రామికవేత్తలు కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదు



### టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు

**విజయవాడ మేజర్ న్యూస్ :** మహిళల భద్రత, సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత వైసిపి నాయకులకు లేదని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు, నగరపాలక సంస్థ టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హనుమంతరావు అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ విజయవాడ పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొట్టేటి హనుమంతరావు మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు సంతోషంగా లేరంటూ వైసీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్కే రోజా మహిళా దినోత్సవం రోజున మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. మహిళల సంక్షేమం గురించి మాట్లాడే కనీస అర్హత ఆర్కే రోజాకు, సజ్జల రామకృష్ణారెడ్డికి లేదన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. మహిళలకు భద్రత కరువైందన్నారు. మహిళల సంక్షేమం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అటకెక్కిందని, మహిళలు రోడ్డుపై తిరగాలంటేనే ఆనాడు భయపడ్డారన్నారు. డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ మహిళ సాధికారిత దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. మహిళా భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం సహ ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది మహిళల గౌరవం కూటమి ప్రభుత్వంలో పెరిగేలా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారన్నారు. ఇవేమీ తెలియని వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఆంధ్ర రాష్ట్రంలోని మహిళలు క్షమించరన్నారు. మహిళా దినోత్సవం రోజున మహిళలను అవమానపరిచేలా వైసీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్కే రోజా చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న కాలంలో మహిళలు వైసీపీ నాయకులకు మరోసారి బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి దోమగుంట్ల రవికుమార్, అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీలు



**గన్నవరం, మార్చి 10, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గన్నవరం గాంధీ చౌక్ వద్ద గన్నవరం ఎస్ఐ ఎం. నాగరాజు పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అనేక ప్రమాదాలలో ప్రాణనష్టం కూడా జరుగుతుందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా తలకు రక్షణ లభించి ప్రాణాలు కాపాడుకోవచ్చని ఆయన సూచించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని, వేగంగా వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## ఘనంగా ఆమనుగంటి శ్రీరాములు జయంతి వేడుకలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘ స్థాపకుల్లో ప్రముఖుడైన ఆమనుగంటి శ్రీరాములు 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నాయకులు, సభ్యులు కలిసి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షులు రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఆమనుగంటి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యతకు ఆయన చేసిన కృషి ఎన్జీవో సంఘానికి బలమైన పునాది వేసిందని అన్నారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ఆయన చూపిన మార్గంలోనే ఉద్యోగులు ఐక్యంగా పనిచేస్తూ తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ కామ్రేడ్స్ అబ్దుల్ అజీజ్, సుబ్రహ్మణ్యం లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ సురేష్ ఉపాధ్యక్షులు అప్పికట్ల తారక మస్తాన్, కోశాధికారి ఎస్ వెంకటేశ్వరరావు ఎస్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు ఎన్జీవో సంఘ నాయకులు, సభ్యులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# 16 నుంచి గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం

### ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు 8వ విడత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 1,93,050 పశువులకు టీకాలు వేయాలనే లక్ష్యంతో 34 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

ఒక్కో బృందంలో ఒక పశువైద్యుడు, ఒక పారా వెటర్నరీ సిబ్బంది, ఒక పశుసంవర్ధక సహాయ కుడు ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్న విషయాన్ని వివరించాలని.. వ్యాధి లక్షణాలు, వ్యాధి వల్ల కలిగే నష్టాలు, వ్యాధి నిరోధక టీకాల వల్ల కలిగే లాభాలను వివరించాలని సూచించారు. నాలుగు నెలల వయసు దాటిన ప్రతి ఆవు లేదా గేదె జాతి పశువులకు తప్పనిసరిగా టీకా వేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మంత్రముగ్ధులను చేసిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ అనుభవం




**గుంటూరు మేజర్ న్యూస్ :** లివింగ్ ఇట్ లార్జ్ సిద్ధాంతాన్ని సంబరం చేస్తూ, సీగ్రామ్ రాయల్ స్టాగ్ ఎంతో ఊహించిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ నాలుగవ ఎడిషన్‌ను ఈ నెల 7న వైజాగ్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు తెచ్చింది. ఇంతకు ముందు ఎడిషన్స్ ఘన విజయంతో, ఈ ఏడాది రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఉత్తమమైన సంగీతం, గేమింగ్ ఎంటర్టైన్మెంట్ రెండిటి మిశ్రమాన్ని ఒకే లీనమయ్యే అనుభవంలోకి స్థాయిని పెంచింది. ఈ ఆకట్టుకున్న సాయంత్రం కార్యక్రమానికి భారతదేశంలో అత్యంత సెలబ్రిటీ కళాకారులు చేసిన ప్రదర్శనలకు వేలాది మంది అభిమానులు హాజరయ్యారు. అత్యంత ఉత్సాహవంతమైన సెట్స్ నుండి మర్చిపోలేని స్టేజ్‌పై క్షణాల వరకు, ఈ కార్యక్రమం ఈ తరం జనరేషన్ లార్జ్ వినసొంపైన సంగీతం, దృశ్యాలు, స్పష్టమైన స్ఫూర్తి శక్తివంతమైన ప్రదర్శనను అందించిందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దేబాశ్రీ దాస్ గుప్తా అన్నారు.

## ఎస్కార్ట్స్ కుబోటా నుంచి కొత్త 'సౌత్ స్పెషల్' వరి ట్రాక్టర్ సిరీస్



**విజయవాడ మేజర్ న్యూస్ :** వ్యవసాయ యంత్రాలు, నిర్మాణ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థ ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్, పవర్ ట్రాక్ శౌర్య పేరుతో కొత్త 'సౌత్ స్పెషల్' వరి ట్రాక్టర్ సిరీస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ సిరీస్‌లో 39హెచ్‌పి నుండి 52 హెచ్‌పీ విభాగాలలో ఐదు వేర్వేరు రకాలను అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలలోని వరి సాగు ప్రాంతాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొట్టమొదటి వరి, మాగాణి ప్రత్యేక సిరీస్ ఇది. పవర్ ట్రాక్ బ్రాండ్ ద్వారా ఈ రకమైన ప్రత్యేక శ్రేణిని పరిచయం చేయడం ఇదే తొలిసారి. దీని ద్వారా కీలకమైన వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో కంపెనీ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటోంది. భారతదేశంలో ఎస్కార్ట్స్ కుబోటా సంస్థ... కుబోటా, ఫామ్‌ట్రాక్, పవర్‌ట్రాక్ అనే మూడు బ్రాండ్ల పేరుతో ట్రాక్టర్లను విక్రయిస్తోంది. ఇవి వరుసగా ప్రీమియం, ఎంట్రీ–ప్రీమియం, వాల్యూ విభాగాల అవసరాలను తీరుస్తున్నాయి. వీటిలో పవర్‌ట్రాక్ బ్రాండ్ అనేది తక్కువ ఖర్చుతో కూడిన వాల్యూ, మాస్ సెగ్మెంట్ విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ బ్రాండ్ కింద వివిధ రకాల వ్యవసాయ పనులకు ఉపయోగపడే ట్రాక్టర్లను కంపెనీ అందిస్తోంది.

## మాన్యవర్ మోహే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'తో విరోష్ ఫినామినా




**గుంటూరు మేజర్ న్యూస్ :** భారతదేశపు అత్యుత్తమ వివాహ ఫ్యాషన్ బ్రాండ్ మాన్యవర్ మోహే.. రష్మిక మందన, విజయ్ దేవర కొండలను తన నూతన వాణిజ్య ప్రచార చిత్రం 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'కు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకుంది. ఈ జంట ఎవరూ కాదనలేని కెమిస్ట్రీతో గతంలో ఎన్నడూ చూడని కలెక్షన్‌తో, వారి అంతిమ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' క్షణానికి దారితీస్తుంది. ఒక స్టైలిష్, సింక్రొనైజ్డ్ ప్రణాళికగా ప్రారంభమయ్యేది తక్షణమే ఒక చరిత్రగా, లిరికల్ షోడౌన్‌గా మారుతుంది. 'ఇద్దరం ఒకే రకమైన దుస్తులు వేసుకుందాం అనుకున్నాం కదా, కానీ, ఇవేం దుస్తులు ధరించావు' అనే మొదటి చమత్కారమైన షాట్‌ను రష్మిక పేల్చడంతో ఉల్లాసభరితంగా ప్రారంభమవుతుంది. ఆమె మాటలకు విజయ్ స్పందిస్తూ, 'నీ హీరో ఇంప్రెస్ చేస్తున్నాడు, అవును కదా?' అంటూ అంతే మనోహరమైన సమాధానాన్ని ఇస్తాడు. ఈ హాస్యం సరదాగా మరో స్థాయికి చేరుకుంటుంది. 'అయితే క్యాన్సిల్ చేద్దాం! మనం మేడ్ ఫర్ ఈచ్ అదర్ కాదు కదా' అనే నాటకీయ ప్రకటనతో ముగుస్తుంది. ప్రేక్షకులు 'వారు చేస్తారా లేదా చేయరా' అనే సరదా, రొమాంటిక్–కామ్ శైలి ఉద్రిక్తతను కొనసాగిస్తున్న సమయంలో సంగీతం మృదువుగా మారుతుంది.. కథ కూడా రంజుగా మారుతుంది. ఈ క్యాంపెయిన్ ఉత్కంఠభరితమైన దృశ్యకావ్యంతో ముగుస్తుంది. విజయ్ మాన్యవర్ ఇండో వెస్టర్న్ శైలి దుస్తుల్లో అద్భుతంగా సిద్ధం కాగా, రష్మిక మోహే లెహంగాలో మెరిసిపోయారు. కొత్త టీవీసీ టెలివిజన్, డిజిటల్, ప్రింట్, సినిమా, అవుట్‌డోర్, సోషల్ మీడియా, వ్యూహాత్మక పీఆర్‌లలో విస్తరించి ఉన్న బలమైన 360 డిగ్రీల ప్రచారం ద్వారా విస్తరించనుంది.

## జిల్లా ఎస్పీని కలిసిన డాక్టర్ హసీమ్ బేగ్



మచిలీపట్నం మేజర్ న్యూస్ : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీమ్ బేగ్ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే ఇఫ్తార్ విందుకి కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుని మర్యాదపూర్వంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ హసీమ్ బేగ్ ఎస్పీకి శాలువాతో సన్మానించి వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మచిలీపట్నం కవి, రచయిత ముదిగొండ శాస్త్రి పాల్గొన్నారు.

## సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి సన్మానం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి నూతనంగా నియమించబడిన సూపరింటెండెంట్ లీలా ప్రసాద్ ను బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు మంగళవారం పుష్ప గుచ్ఛంతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సుబ్రమ్మణ్యం ఆస్పత్రిలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూపరింటెండెంట్ ను కోరారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లుగా శేకుబోయిన తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్తి బాల, టి.సీతారాం, జోగి శివ, నిక్కు రాధాకృష్ణ, భోగి రెడ్డి సుభాని, రత్తయ్య, బెల్లంకొండ రవి, అన్నారి, ఉప్పతల కోటేశ్వరరావు, రామరాజు, పి.సాంబశివ, బోయిన రమేష్, చేబోయిన కోటేశ్వరరావు తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

### తిరుమల అన్నదాన సత్రానికి
## కూరగాయల లారీ పంపిణీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : పరాస్ పేట శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి దేవాలయం నుండి ఆలయ ఈవో ఘనంగా పంపిణీ చేశారు. స్థానిక పరాసుపేటలో వెలసిన శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో రెండవ మంగళవారం విశేష సేవా కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంకి అన్నదాన నిమిత్తం, ఆలయ కమిటీ సభ్యులు ఐలా శివనాగేశ్వరరావు కుమారుడు దుర్గా సాయి మారుతీ, శ్రీకృష్ణ కుమార్, భక్త బృందం ఆధ్వర్యంలో ఒక లారీ కూరగాయలను తిరుమలకు పంపించారు. దేవస్థాన ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన రావు, చైర్మన్ ఆలపాటి రమేష్, పాలకవర్గ సభ్యులు విశ్వనాథపల్లి నాగ రాజు,మానేపల్లి ఉషారాణి,మోపర్తి ఉమాదేవి, నందిపాముల శ్రీనివాస్ ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ప్రసన్న కుమార్, అగ్నిహోత్రం బదరి నాథ్, ముఖ్య అతిథ లంకా జెండా ఊపి కూరగాయల లారీని తిరుమల క్షేత్రానికి పంపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## పది పరీక్షా కేంద్రాలకు ఉచిత బస్ సర్వీసులు

అవనిగడ్డ మేజర్ న్యూస్ : ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఎస్.ఎస్.సి.(టెన్త్ క్లాస్) పబ్లిక్ ఎగ్జామ్స్ కి హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ క్లాస్ ఎగ్జామ్ రాసే విద్యార్థులు తమ నివాస స్థలము నుండి ఎగ్జామినేషన్ సెంటర్కు వెళ్లి పరీక్ష రాసి మరల తిరిగి రావటం కోసం ఏపీఎస్ఆర్టీసీ విద్యార్థులకు ఉచిత ప్రయాణసౌకర్యాన్ని అందజేస్తున్నారు. ఇందుకుగాను విద్యార్థిని విద్యార్థులు తమ హాల్ టికెట్ ను బస్సులో కండక్టర్కు చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చును. ఎటువంటి స్టూడెంట్ పాస్ లేకపోయినప్పటికీ కూడా హాల్ టికెట్ పై ఉచిత ప్రయాణం చేయుటకు ఏర్పాటు చేయడం మైనదని, అవనిగడ్డ పరిధిలోని పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించగలరని ఏపీఎస్ఆర్టీసీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈ ప్రభుత్వం అవినీతి, అరాచకాలను ప్రోత్సహించదు

### అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కోడూరు మేజర్ న్యూస్ : ఈ ప్రభుత్వం అవినీతి, అరాచకాలను ప్రోత్సహించదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే 59 అర్జీలు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కారాలు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరులో ఉపాధి హామీ నిధులతో తారు రోడ్డు నిర్మాణాన్ని కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయడంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దాదాగిరీ చేస్తామంటే లొంగవద్దన్నారు. ఎవరో బెదిరిస్తే భయపడవద్దన్నారు. ఈ ప్రభుత్వం అవినీతి, అరాచకాలను ప్రోత్సహించదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అధికారాలను కూడా లాక్కునేలా బెదిరించే ప్రయత్నం చేసే వారికి లొంగిపోతే ఇక ప్రజలకు తాము ఏం ధైర్యం ఇస్తామని ప్రశ్నించారు. ఎవ్వరైనా సరే అధికారులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో భయపడవద్దని మీ వెనక నేను నిలబడతా.. అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం న్యాయబద్ధంగా పనిచేయాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి పని చేయాలని ఎవరు కోరినా ఒప్పుకోవద్దని స్పష్టం చేశారు. ఎవరికీ తలవంచాల్సిన పని లేదన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి విషయాలను ఎట్టి పరిస్థితిలో ప్రోత్సహించరని స్పష్టం చేశారు. కోడూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఘటనపై తీసుకున్న చర్యలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. కచ్చితంగా కోడూరు రోడ్డు ఘటన సీఎం దృష్టికి వెళుతుందన్నారు. అవినీతిరహిత, పారదర్శక, చట్టబద్ధ పరిపాలన అందించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూచనల ప్రకారమే నియోజకవర్గంలో పనిచేస్తున్నామని, తదనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ర్యాంకుల్లో అవనిగడ్డ నియోజకవర్గానికి రాష్ట్రంలో 11వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు లభించాయని తెలిపారు. అధికారులు ఎవరో ఒకరి బెదిరింపులకు భయపడవద్దని, చట్టం అనుసరించి ముందుకు వెళ్లాలని, మీ వెనక నేనుంటానని స్పష్టం చేశారు. అరాచకాలు, అవినీతికి తాను వ్యతిరేకం అన్నారు. తప్పుడు పనులు చేసే వారిని ప్రోత్సహించేది లేదన్నారు. అరాచకాలు, బెదిరింపులకు లొంగేది లేదన్నారు. తాము ప్రజల కోసం పనిచేస్తున్నామని, వ్యక్తుల ప్రయోజనాల కోసం కాదని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఎంపీడీఓ సుధా ప్రవీణ్, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు జోలికి వస్తే ఊరుకునేది లేదు



విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గంపలగూడెంలోని నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తన అనుచరులతో ఎమ్మెల్యే పై దాడి చేయించటం సరికాదని, ఎంపీ తన ప్రవర్తన మార్చుకోకపోతే ఊరుకునే ప్రసక్తి లేదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా, రిజర్వుడ్ స్థానం అయినా తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు దళితుడని ఎంపీ అలా ప్రవర్తించడం మానుకోవాలని, ఎమ్మెల్యే కి రాజ్యాంగం కల్పించిన హక్కులను అడ్డుకోవాలని చూస్తే, కేశినేని శివనాథుని ఎమ్మార్పీఎస్ చూస్తూ ఊరుకోదని, ఎంపీ శివనాథుని (చిన్ని) నీ తిరువూరు ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నూకపోగు ఏసు మాదిగ, గన్నవరం నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇంచార్జి మంద వేణు మాదిగ, విజయవాడ రూరల్ మండలం ఎం ఎస్ పి ఇంచార్జీ పి.దేవదాసు మాదిగ, మండల నాయకుడు కోంద్రు మోహన్ దాస్ మాదిగ, నున్న గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ప్రత్తిపాటి బుచ్చయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లమోతు కిశోర్ మాదిగ, ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథం సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు మేజర్ న్యూస్ : స్వచ్ఛ రథం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. మంగళవారం కోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు అనువుగా, ప్లాస్టిక్ వ్యర్థాలు, పేపర్ వ్యర్థాలు స్వచ్ఛ రథానికి ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, జనసేన మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, సొసైటీ చైర్మన్ కోట సుబ్బారావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్, నాయకులు గుడిసేవ సూర్యనారాయణ, ముద్దినేని చంద్రరావు, సిద్ధినేని అశోక్ నాయుడు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, అధికారులు పాల్గొన్నారు.



# యువత ఉద్యోగ అన్వేషకులుగా కాకుండా సృష్టికర్తలుగా సత్తా చాటాలి



### సామాజిక మార్పుకు ప్రతినిధులుగా యువత ఉండాలి

### ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు

పమిడిముక్కల మేజర్ న్యూస్ : చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం కాకుండా కంపెనీలే తమకు అవసరమైన నిపుణులను ఆహ్వానించేలా యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఆకాంక్షించారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మొవ్వా ప్రణయ్ వికాస్ ఎంబిఏ పూర్తి చేసి ప్రాంగణ ఎంపిక ద్వారా క్వారీ లగ్జరీ స్టోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో సేల్స్ క్యూరేటర్ ఉద్యోగం సాధించిన సందర్భంగా మంగళవారం స్థానిక చర్చిలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ బాబు మాట్లాడుతూ యువత చదువుకునే సమయంలో ఎప్పటికప్పుడు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా వివిధ రంగాలలో అపారమైన అవకాశాలు ఉంటాయన్నారు. యువత సృజనాత్మక నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉద్యోగాల కోసం పోటీ పెరిగిపోయిందని, నైపుణ్యం లేకుండా నామమాత్రపు చదువులతో ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. విన్నూత్న ఆలోచనల ద్వారా విభిన్న నైపుణ్యాలను సృష్టించాలన్నారు. సమాజంలో చురుకైన భాగస్వాములుగా ఉంటూ యువత సామాజిక మార్పునకు ప్రతినిధులుగా ఉండాలన్నారు. తన ప్రతిభ ద్వారా బహుళ జాతి కంపెనీలో ఉద్యోగం పొందిన ప్రణయ్ వికాస్ గ్రామంలో యువతకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొడాలి కోటేశ్వరరావు, ఈడుపుగంటి ప్రసాద్, మొవ్వా ఆనంద్ కుమార్, నీరజ, పాస్టర్ విజయకుమార్, ప్రసాదరావు, సుదేష్ణ, బుల్లియ్య, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలంపాడు షిరిడి సాయిబాబా మందిరం 38 వసంతాలు





## 1008 కలశాలతో ప్రత్యేక పూజ

### ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని ముత్యాలంపాడు షిరిడి సాయిబాబా మందిరంలో ఆలయం స్థాపించి 38 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 1008 కలశాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ముత్యాలంపాడు లో సాయినాథ్ దేవాలయం ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందినదని, ప్రతి వారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారని తెలిపారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం నిర్వహించడం, ముఖ్యంగా గురు పౌర్ణమి వంటి పండుగలను అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమని... గత 38 సంవత్సరాలుగా నిరంతరం స్వామివారికి సేవ చేస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కాకుండా ఎప్పటికప్పుడు స్వామివారి భక్తుడిగా ఆలయ కార్యక్రమాలకు హాజరవుతూ స్వామివారి ఆశీస్సులు పొందుతున్నానని... ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా ప్రభుత్వం తరపున పోలీసు శాఖతో సమన్వయం చేసి ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని, కార్యక్రమాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించినట్లు తెలిపారు.

ఇటీవల ఆలయం వెనుక భాగంలో గోడ కూలిపోయిన విషయాన్ని కమిటీ సభ్యులు తెలియజేయగా, ఆ గోడ పునర్నిర్మాణానికి ప్రభుత్వం తరపున అనుమతులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు, ఆలయ అభివృద్ధికి అవసరమైన ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.. ఆ షిరిడి సాయినాథ్ స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ కలగాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆంజనేయునికి 2 లక్షల తమలపాకులతో పూజ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో కొలువైయున్న భక్త ఆంజనేయ స్వామి విగ్రహానికి 2 లక్షల 6 వేల తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. శ్రీ అవధూతేంద్ర భక్త మండలి భజన సమాజం ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 26వ తేదీన ప్రారంభమైన 108 రోజుల హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ప్రతి రోజూ 108 సార్లు చాలీసా పఠించే ఈ క్రతువులో భాగంగా, మంగళవారం నాటికి ఈ కార్యక్రమం 44వ రోజుకు చేరుకుంది. ఈ పూజలో భాగంగా మంగళవారం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన 2 లక్షల 6 వేల తమలపాకులతో విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. గ్రామానికి చెందిన కొండవీటి దిలీప్ - అంజలి దంపతులు, దాసినేని శ్రీనివాసరావు - రాణి దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. ప్రతిరోజూ గ్రామస్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరవుతూ ఈ ఆధ్యాత్మిక యజ్ఞాన్ని దిగ్విజయం చేస్తున్నారు. గ్రామ ప్రజలు చూపుతున్న చొరవకు, భక్తి తత్పరతకు ఆలయ ధర్మకర్త దాసినేని రామకోటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. 108 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం గ్రామంలో శాంతి సౌభాగ్యాలను నింపుతుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శాఖాధిపతులతో కౌన్సిల్ ఎజెండాపై మేయర్ సమీక్ష



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** మార్చి 11, 2026 న జరిగే కౌన్సిల్ ఎజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో మంగళవారం ఉదయం శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండా ఉన్న ప్రతిపాదనలను శాఖాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ. రవీంద్రరావు, సెక్రటరీ ఇంచార్జి కె. ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇ/సి పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) ఎం విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. శ్రీనివాస్, సామ్రాజ్యం, ప్రభాకర్, సురేఖ, గోపాలకృష్ణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, గోపాల నాయక్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ జనోద్ధరణకు పాటుపడిన సావిత్రిభాయి పూలే



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** దేశంలో తొలి ఉపాధ్యాయినిగా మహిళలకు విద్య ఎంతో అవసరమని స్త్రీలకు విద్యాబుద్ధులు నేర్పటంతోపాటు సమాజం లో అణగారినవర్గాల తరపున భర్త మహాత్మా జ్యోతీరావు పూలేకు వెన్నంటి నిలిచిన పోరాటం చేసిన మహనీయురాలు సావిత్రిభాయి పూలే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సావిత్రిభాయి పూలే వర్ధంతిని మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వ రరావు వికాసకేంద్రంలో జరిగింది. సావిత్రిభాయి పూలే చిత్రపటానికి నేతలు పూలమాలలు వేశారు. స్త్రీవాద ఉద్యమంలో అగ్రగామిగా నిలిచిన సావిత్రి భాయి పూలే మహిళల హక్కులు, బాలికా విద్య కోసం పోరాటం చేశారనీ, సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ తొలి బాలికల పాఠశాలను నెలకొల్పిందని తెలిపారు. భర్త అడుగుజా డల్లో నడుస్తూ ఆయన వెన్నంటి నిలిచి సంఘ సంస్కర్తగా నిలిచారనీ, దేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. విశ్రాంత ఈవోఆర్డీ దాని సీతారామరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్బాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మీర్ రిజ్వాన్, బీసీ సంఘాల నేతలు ఉప్పల సాంబశివరావు, అంబటి శంకరరావు, అల్లూరి బాబూరావు, లీలాబ్రహ్మేంద్ర, శరత్బాబు, జగ్గవరపు బాబూరావు, కొండేటి భాస్కరరావు, సిద్దాబత్తుల వాసు, మాజీ వార్డుసభ్యుడు బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులు 72మందికి రూ.73,69,679లు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు తమ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం కోరుతూ సమర్పించే దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ లబ్ధిదారుల తరపున ధన్యవాదములు తెలిపారు.

## ఉత్తమ పారా కబడ్డీ క్రీడా కారులను జాతికి అందించడమే లక్ష్యం



**గన్నవరం, మార్చి 10, మేజర్ న్యూస్ :** వెలగపూడి ఉజ్వల్ ఆంధ్రప్రదేశ్లోని గ్రామీణ ప్రాంత ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉత్తమ దివ్యాంగ కబడ్డీ క్రీడా కారులను జాతికి అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ పారా అమెచ్యూర్ కబడ్డీ సంఘం అధ్యక్షులు వెలగపూడి ఉజ్వల్ అన్నారు మంగళవారం అయన కార్యదర్శి డి.యన్ రాజును కలవడానికి వచ్చిన సందర్భంగా కొద్ది సేపు మాట్లాడారు. ఈ నెల 29 నుండి 31 వరకు చండిగర్లో జరుగబోయే జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ ఛాంపియన్ షిప్కు రాష్ట్ర జట్టును సిద్ధం చేస్తున్నట్లు ఉజ్వల్ తెలిపారు. ఆసియా క్రీడలలో పాల్గొనే భారత కబడ్డీ జట్టులో మన రాష్ట్ర జట్టు క్రీడాకారులు ఉండేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది జాతీయ క్రీడా ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్లో అన్ని కేటగిరి లలో జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. పారా కబడ్డీ క్రీడాకారులను ప్రభుత్వం చేయూతనందించి, ప్రోత్సహించాలని ఉజ్వల్ కోరారు. అయనతో పాటు కృష్ణా జిల్లా సంఘ సభ్యులు పి. నరేంద్ర బాబు ఉన్నారు.

## జనసేన ఎమ్మెల్యేపై టీడీపీ నేత ఫైర్



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరులో రూ. 22 లక్షల సిసి రోడ్డు పనులు కూటమి పార్టీల మధ్య విభేదాలు బయటపడ్డాయి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పూజలు చేసి పనులు ప్రారంభించగా కొద్దిసేపటికే టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు మళ్లీ పూజలు చేయడం చర్చనీయాంసమైనది, టీడీపీని భ్రష్టు పట్టించాలని చూస్తున్నారని ఎమ్మెల్యే, ఆయన కుమారుడుపై శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు చేశారు.



## 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లుపంపిణీ

**మొవ్వ మేజర్ న్యూస్:** 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 16వతేది నుంచి జరిగే 10.వ.తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు హాల్ టికెట్లనుఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంగళవారం విద్యార్థులకు అందించారు.దీనిలో భాగంగానే కూచిపూడి శ్రీ సిద్ధేంద్రజిల్లా పరిషత్ ప్రాచోన్నతపాఠశాలలో మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమిరెడ్డి. అనుపల్లవి భువనేశ్వరి పరీక్షలకు హాజరయ్యే 29 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. అలాగే కోసూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో 27 మందికి, కాజ హైస్కూల్లో 56 మంది, భట్లపెనుమర్రులో 46, మొవ్వ హైస్కూల్లో 147 మంది,చినముత్తేవిహైస్కూల్లో 24 మంది, నిడుమోలులో 40 మంది, పెడసనగల్లులో 43 మంది,పెదముత్తేవి సంస్కృత ఉన్నత పాఠశాలలో 12 మందికి హాల్ టికెట్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందించారు.

## గురజాడ రైతు సేవా కేంద్రంలో 'ఈ-పంట' సోషల్ ఆడిట్

### పారదర్శకంగా పంట నమోదు ప్రక్రియ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** స్థానిక రైతు సేవా కేంద్రంలో 'ఈ-పంట' నమోదుపై సోషల్ ఆడిట్ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామాజిక తనిఖీ నిర్వహించి, పంట నమోదులో పారదర్శకతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. సునీల్ గవాస్కర్, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ చంద్ర పాల్గొని ఈ-పంట ఎస్.ఓ.పి మార్గదర్శకాల ప్రకారం రైతు సేవా కేంద్రం వద్ద పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. జాబితాపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను అధికారుల సమక్షంలోనే క్షుణ్ణంగా విచారించారు. అనంతరం గ్రామసభలో అందరి ముందు చర్చించి, ఏకగ్రీవంగా తుది జాబితాను ఆమోదించారు. ఈ సందర్భంగా ఏఈఓ సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, పంట భీమా ప్రయోజనాలు నేరుగా రైతులకు అందుతాయని వివరించారు.

## గన్నవరంలో ప్రముఖ హీరో జగపతిబాబు సందడి



గన్నవరం, మార్చి 10, మేజర్ న్యూస్: హైదరాబాదు నుండి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ప్రముఖ సినీ నటుడు జగపతి బాబు కు అభిమానులు, సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. గన్నవరం విమానాశ్రయంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి దొప్పలపూడి ప్రవీణ్ శాలువా కప్పి బొకే అందించి ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం జగపతిబాబు దొప్పలపూడి ప్రవీణ్ నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి కాసేపు ఆనందంగా గడిపారు. ఈ విషయం తెలిసిన అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రవీణ్ ఇంటికి చేరుకుని తమ అభిమాన నటుడిని చూడటానికి ఆసక్తి చూపారు. అభిమానులతో ఆత్మీయంగా పలకరించిన జగపతిబాబు, వారితో ఫోటోలు దిగుతూ కుశల ప్రశ్నలు అడిగి కొంతసేపు సందడి చేశారు. ఆయన రాకతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.

# ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటు

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం 58వ డివిజన్ డాబా కొట్లు సెంటర్ వద్ద విజయవాడ లో ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టి పాదచారులకు వాహనదారులకు చల్లటి మంచినీరును అందజేశారు... ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో అసంఘటిత కార్మికులు, రోడ్లపై పనిచేసే కూలీలు, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమం పార్టీ తరఫున, స్వంత నిధులతో కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు.. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి నియోజకవర్గం లోని అన్ని డివిజన్లలో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించామని, ఇందులో భాగంగా ఈరోజు 58వ డివిజన్ డాబాకోట్ల సెంటర్‌లో మొదటి చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వర్షాలు పడే వరకు ఈ చలివేంద్రాలు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, అన్ని కేంద్రాల్లో చల్లటి మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు, వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ లు పిరియ జగదాంబ, ఎరుబోతు శ్రావణి, డివిజన్ ఇంచార్జ్ పిరియ సోమేశ్వరరావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు దుర్గారావు, మల్లంపాటి రవి, క్లస్టర్ ఆ లా తారకరామారావు, ఎరుబోతు రామారావు, మహిళా నాయకులు సుల్తానా, పాల రజిని తదితరులు పాల్గొన్నారు.




# స్వర్గీయ మండలి విగ్రహానికి నాయీ బ్రాహ్మణులు నివాళి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్థానిక వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అవనిగడ్డ మధు, రమేష్, బ్రహ్మయ్య, పిచ్చేశ్వ రరావు, రాంబాబు, వెలిగారపు రమేష్, అవనిగడ్డ నాగరాజు, శ్రీనివాసరావు, మోపిదేవి కోటేశ్వరరావు, వీ.సుబ్బారావు, ఏ.వెంకటేశ్వరరావు, నారేపాలెం శ్రీరామకృష్ణ, ధూళిపూడి శ్రీను, ఏ.లంకేశ్వరరావు, నారేపాలెం రంగారావు, ఏ.చంటి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ప్రతినిధులు, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, పెద్ద ఎత్తున మండలి అభిమానులు పాల్గొన్నారు.



# గుంటూరు సీతారామయ్య అన్నసత్రం పాలకమండలి సత్కారం



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావుని గుంటూరు సీతారామయ్య అన్న సత్రం చారిటబుల్ ట్రస్ట్ నూతన పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన మిత్రులు కోలా శ్రీను,ని, ఇతర బోర్డు సభ్యులు కుంచాల సావిత్రి టీడీపీ, మధు కోటేశ్వరమ్మ టీడీపీ, ఒర్సు రమణమ్మ టీడీపీ, పేకేటి సత్యనారాయణ టీడీపీ, కర్రి రమణ కుమారి టీడీపీ, దేవరకొండ లక్ష్మణ్ టీడీపీ, వల్లూరు వెంకట సుబ్బారావు టీడీపీ, కొడాలి బాబురావు బీజేపీ,ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి నుండి కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి ఉన్నత స్థానాల్లో నిలబెట్టి సముచిత గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే కూటమి నాయకులు, కార్యకర్తలకు అనేక నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గౌరవించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా కూటమి కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, విజయ్ కృష్ణ సూపర్ బజార్ డైరెక్టర్ మొత్తూరి కాసిం,నాయి బ్రాహ్మణ డైరెక్టర్ సురవరపు నాగరాజు, 63వ డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, 62వ డివిజన్ ఇంచార్జ్ పైడి శ్రీను, షేక్ మెహర్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతిలోకి ఒబెన్ ఎలక్ట్రిక్.. ఏపీలో నాలుగు షోరూములు



**ది తిరుపతి కొత్త షోరూమ్‌లో ఉగాది పండగ ఆఫర్‌లో రోర్ ఈజెడ్ సిగ్మాపై రూ.37,000 వరకు ప్రయోజనాలు**

**2026 చివరకు రాష్ట్రంలో 15 షోరూమ్‌లు ఏర్పాటు లక్ష్యం**

**విజయవాడ, మార్చి 10, మేజర్ న్యూస్ :** భారతదేశంలో ఆర్&డీ ఆధారిత ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రిక్ మోటర్ సైకిల్ తయారీదారు ఒబెన్ ఎలక్ట్రిక్ రేణిగుంట రోడ్డు తిరుపతిలో మొదటి షోరూమ్ ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌లో తన ఉనికిని విస్తరించింది. అంకితభావంతో కూడిన ఒబెన్ కేర్ సర్వీస్ సెంటర్ తోడ్పాటుతో ఈ కొత్త షోరూమ్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక పనితీరుతో కూడిన ఎలక్ట్రిక్ మోటర్ సైకిల్స్ కోరుకునే రైడర్లకు అందుబాటు పెంచడంతో పాటు విశ్వసనీయమైన ఆఫ్టర్ సేల్స్ సపోర్టు కూడా అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒబెన్ ఎలక్ట్రిక్ 4వ రిటైల్ ఉనికికి సూచిక తిరుపతి షోరూమ్. విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలో ఇప్పటికే షోరూములున్నాయి. ఈ బ్రాండ్ ఈ సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలో తన ఉనికిని 15 షోరూమ్‌లకు విస్తరించాలని యోచిస్తోంది.

ప్రస్తుతం కంపెనీ జాతీయస్థాయిలో హైదరాబాద్, పుణే, ఢిల్లీ, కొచ్చి, బెంగళూరు సహా 85+ నగరాల్లో 100 షోరూమ్‌లకు విస్తరించింది. విస్తృత వ్యూహంలో భాగంగా రాబోయే రెండు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 500లకు పైగా షోరూమ్‌లు, సేవా కేంద్రాలు స్థాపించబోతోంది. పని తీరు, విశ్వసనీయత, భద్రతను కోరుకునే ఆధునిక భారతీయ రైడర్ల కోసం రూపొందించిన ఒబెన్ ఎలక్ట్రిక్ తదుపరి తరం కమ్యూటర్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్, ఇటీవల ఆవిష్కరించిన రోర్ ఈజెడ్ సిగ్మా బలమైన మార్కెట్ ఆసక్తి ఈ విస్తరణకు దోహదపడుతోంది. ఈ సందర్భంగా ఒబెన్ ఎలక్ట్రిక్ వ్యవస్థాపకురాలు, సీఈఓ మధుమిత అగ్రవాల్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌ను తిరుపతి సూచిస్తుందన్నారు. ఇక్కడ రైడర్లు పనితీరు, సాంకేతికత, దీర్ఘకాలిక విశ్వసనీయతను అందించే రవాణా పరిష్కారాల కోసం ఎక్కువగా చూస్తున్నారని తెలిపారు.

# అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి మంగళవారం ఉదయం భవానీపురం, ఐరన్ యార్డ్ ప్రాంతంలలో ఉన్న బాణాసంచా దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసారు



వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎండీ ప్రభాత్ తివారీతో ఎంపీ సమావేశం



**న్యూఢిల్లీ/ విజయవాడ, మార్చి 10, మేజర్ న్యూస్ :** నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ ప్రభాత్ తివారీతో విజయవాడ పార్లమెం టు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) న్యూఢిల్లీలో మంగళవారం సమావేశమయ్యారు. ప్రభాత్ తివారీను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ హైదరా బాద్‌లో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డి) ద్వారా చేపడుతున్న సేవా, మహిళలకు నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక చేయూత నిచ్చే శిక్షణా కార్యక్రమాలను వివరించారు.

**విజయవాడ పార్లమెంటు పరిధిలోని పేద మహిళలకు స్వయం** ఉపాధి చూపేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను ఎన్ఐఆర్‌డీ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. శిక్షణ పొందుతున్న వారిలో అనేక మంది ఎస్సీ (షెడ్యూల్డ్ క్యాస్ట్) మహిళలు ఉన్నారని సీఎండీ తివారీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ఐఆర్‌డీ ద్వారా శిక్షణ తీసుకునే పేద ఎస్సీ మహిళలకు చేయూతనిచ్చేలా నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మార్కెటింగ్, ఫైనాన్స్ సహకారం కల్పించాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఎస్సీ మహిళలకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాముల నిర్వహణ, శిక్షణ తరువాత ఉపాధి నిమిత్తం ఆర్థిక చేయూత ఇచ్చేలా , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ ఎస్సీ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సహకారం అందించాలని కోరారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఐఆర్ డి ద్వారా శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన జాతీయ ఎస్సీ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిఎండి ప్రభాత్ తివారి త్వరలోనే విజయవాడకు ఒక బృందాన్ని పంపించి ఏపీ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు, స్త్రీ నిధి విభాగం సమన్వయంతో పరిశీలన చేయిస్తామని, బృందం నివేదిక అందగానే ఎన్ఐఆర్ డి చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ కు తెలిపారు. ఈ మేరకు త్వరలోనే ఢిల్లీ నుంచి బృందం ను విజయవాడ పంపుతామన్నారు.

# వెబ్సైట్లో గ్రంథాలయ పుస్తకాలను అప్లోడ్ చేయడం అభినందనీయం

**ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం**

**విజయవాడ మేజర్ న్యూస్ :** డిపార్ట్మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన వెబ్సైట్లో గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను అప్లోడ్ చేయడం చాలా అభినందనీయమైన, సంతోషకరమైన విషయం అని ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం (రిజిస్ట్రేషన్ నెం. 61/2024, అమరావతి) రాష్ట్ర అధ్యక్షులు డా. కళ్ళేపల్లి మధుసూదన రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు వెంకట రమణ, రాష్ట్ర కన్వీనర్ కోన దేవదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంత్రి నారా లోకేష్ బాబు, ప్రారంభించిన ఈ వెబ్సైట్ వలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠకులకు, విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుచున్నదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు గ్రంథాలయాలలో మాత్రమే లభ్యమయ్యే అనేక విలువైన పుస్తకాలు ఈ వెబ్సైట్ ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులోకి రావడం వలన ప్రజలు ఎక్కడనుండైనా వాటిని సులభంగా పరిశీలించే అవకాశం కలుగుతున్నదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులకు, పుస్తకాలను సులభంగా పొందలేని పాఠకులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతున్నదని తెలిపారు. ఈ విధంగా సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు గ్రంథాలయ సేవలను మరింత చేరువ చేయడానికి చేపట్టిన ఈ కార్యక్రమం నిజంగా ప్రశంసనీయమైనదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా గ్రంథాలయ శాఖలో పనిచేయుచున్న కొత్తగా వచ్చిన కార్యదర్శులకు కొత్తగా వస్తున్న సీనియర్ అసిస్టెంట్ లకు ప్రభుత్వ ఉత్తర్వులు, సేవా నియమాలు, పదోన్నతులకు సంబంధించిన నిబంధనలపై సరైన, పూర్తి స్థాయి అవగాహన లేకపోవుట వలన ప్రతి జిల్లాలో పరిపాలనా విధానాలు ఒకే విధంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా పదోన్నతుల విషయంలో, పరిపాలనా నిర్ణయాలలో జిల్లాలవారీగా వేర్వేరు విధానాలు అనుసరించబడుచున్నట్లు కనిపించడంలేదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ పరిస్థితి వలన సంస్థలో పనిచేయుచున్న ఉద్యోగులలో చాలామందికి పదోన్నతుల విషయంలో స్పష్టత లేకపోవడం జరుగుతుంది.

అలాగే కొన్నిసార్లు విధి నిర్వహణలో కార్యదర్శులు తీసుకునే నిర్ణయాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే సందేహాలు కూడా ఉద్యోగులలో ఏర్పడుతున్నాయి. దీని వలన ఉద్యోగులలో అసంతృప్తి, అన్యాయం జరిగినట్లుగా భావించే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం శాఖలో అమలులో ఉన్న పదోన్నతి నియమాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, మీరు జారీచేసే మెమోలు, సేవా నియమాలు, ఉద్యోగులపై తీసుకునే పరిపాలనా చర్యలకు సంబంధించిన సి.సి.ఎ. రూల్స్, అన్ని ప్రభుత్వ నిబంధనలను కూడా నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయ వెబ్సైట్లో అందుబాటులో ఉంచితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఇలా వెబ్సైట్లో ప్రభుత్వ ఉత్తర్వులు, నియ మాలు అందుబాటులో ఉంటే రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులు వాటిని సులభంగా పరిశీలించుకొని వారికి సంబంధించిన విషయాలలో సరైన అవగాహన పొందే అవకాశం కలుగుతుందని, అంతేకాకుండా జరిగిన పరిపాలనా చర్యలు లేదా పదో న్నతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని కూడా ఉద్యోగులు స్వయంగా తెలుసుకునే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఇది అమలులోకి వస్తే గ్రంథాలయ శాఖలో పరిపాలనా పారదర్శకత పెరగడంతో పాటు అన్ని జిల్లాలలో ఒకే విధమైన విధానాలు అమలులో ఉండుటకు కూడా ఎంతో దోహదపడును, అలాగే శాఖలో పనిచే యుచున్న ఉద్యోగులలో విశ్వాసం, సంతృప్తి పెరగడానికి కూడా ఇది సహాయ పడునని, సమస్యలు ఏమైనా ఏర్పడితే అవి తమ వరకు రాకుండా జిల్లాల్లోనే పరిష్కారం అవుతాయని తెలియజేశారు. కాబట్టి పై విషయాలను దయచేసి సానుభూతితో పరిశీలించి, ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, ఎప్పటికప్పుడు వస్తున్న కొత్తరూల్స్, సేవా నియమాలు, పదోన్నతి విధానాలు, ఇతర పరిపాలనా నిబంధనలతో పాటుగా గ్రంథాలయ నిర్వహణకు సంబం ధించిన ముఖ్యమైన కార్యకలాపాలు అయిన పుస్తకాల ఇష్యూ, కన్సల్టేషన్, ధరావతులు నమోదు, స్టాక్ వెరిఫికేషన్ వంటి ఇతర ప్రక్రియలు, అలాగే ప్రతి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల వివరాలు, గ్రంథాలయానికి సంబంధించిన సమగ్ర డేటా మొత్తం కూడా వెబ్సైట్‌లో లేదా మొబైల్ యాప్ ద్వారా నిర్వహించే విధంగా ఏర్పాట్లు జరిగితే రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల పనితీరు మరింత సులభతరంగా, పారదర్శకంగా మారునని తెలిపారు. ఈ విధంగా డిజిటల్ విధానంలో గ్రంథా లయ నిర్వహణ అమలు చేయబడినట్లయితే అది కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేష్ హయాంలో గ్రంథాలయ శాఖలో ఒక ముఖ్యమైన సంస్కరణగా నిలిచి పోవునని పేర్కొన్నారు. గ్రంథాలయ శాఖకు కూడా మంచి పేరు వస్తుందని, కావున గ్రంథాలయ శాఖ నూతన వెబ్సైట్‌లో పైన తెల్పిన విషయాలు పొందు పరచుటకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం తరుపున కోరుతున్నట్లు తెలియజేశారు.

# యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు**

**మీడియా ముందు ప్రవేశపెట్టిన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా చేసే వ్యవస్థలపై ఉక్కు పాదం మోపుతామని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలంలో గంజాయి తరలిస్తూ పట్టుబడిన అంతరాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠాను మీడియా ముందు ప్రవేశపెట్టారు. యువత గంజాయి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హితవు పలికారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇటీవల పమిడిముక్కల మండలంలో పట్టుబడిన అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా చేసే ముఠా సభ్యులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ తెనాలి ప్రాంతానికి చెందిన మనబోటి ఈశ్వర ప్రసాద్ తమిళనాడుకు చెందిన దుర్రై మోహన్ కుమార్ విశాఖపట్నంకి చెందిన అల్లా అమీన్‌లు గతంలో తమిళనాడు సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో స్నేహితులుగా మారారన్నారు. సులభ పద్ధతిలో డబ్బును సంపాదించాలనే దురుద్దేశంతో గంజాయి సరఫరాను ఎంచుకున్నారన్నారు.

నిందితులు ముగ్గురు కలిసి 52 కేజీల గంజాయి 26 ప్యాకెట్లుగా పార్సిల్ చేసి కారులో తరలిస్తున్న క్రమంలో తోట్లవల్లూరు ఎస్సై పి కిషోర్ నేతృత్వంలోని సిబ్బంది అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రెండు లక్షల అరవై వేల మేర ఉంటుందని తెలిపారు. గంజాయి సరఫరాకు వినియోగించిన కారు నిందితులకు చెందిన మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనపరచుకున్నట్లు వెల్లడించారు. యువతను మత్తుపదార్థాలకు బానిసలు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయిని తరలిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభను చాటిన తోట్లవల్లూరు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

# నారాయణ పాఠశాలలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు



**గన్నవరం, మార్చి 10, మేజర్ న్యూస్ :** స్థానిక విద్యానగర్‌లోని నారాయణ పాఠశాలలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సైబర్ నేర విభాగం అధికారులు శ్రీధర్, గన్నవరం ఎస్ఐ ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, రహస్య సంకేత పదాలు ఎవరికీ చెప్పకూడదని, బలమైన రహస్య సంకేత పదాలను ఎలా ఏర్పాటు చేసుకోవాలో వివరించారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా వేధింపులకు గురి చేస్తే భయపడకుండా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. అవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అదేవిధంగా ఆన్‌లైన్ ఆటలు ఆడే సమయంలో అనుమానాస్పద లింకులను తెరవకూడదని హెచ్చరించారు. సాంకేతికతను వినియోగించడం ఎంత అవసరమో, దాని వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండటం అంతకంటే ముఖ్యమని ఎస్ఐ శ్రీధర్, మహిళా ఎస్ఐ ప్రశాంతి తెలిపారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు వారు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ భాషా, ఏజీఎం సత్తిరెడ్డి, అకాడమిక్ డీన్ నవీన, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సరీల నిర్వహణపై రైతులకు ప్రయోగాత్మక శిక్షణ





**జగ్గయ్యపేట, మార్చి 10, మేజర్ న్యూస్ :** మండలంలో గరికపాడు గ్రామంలో ఉన్న కేవీకేలో రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. డా. కే. ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న ఉద్యాన నర్సరీ యాజమాన్య పద్ధతులపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం రెండవ రోజు ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ శిక్షణలో పాల్గొన్న రైతులకు నర్సరీ నిర్వహణలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాయోగికంగా, సిద్ధాంతపరంగా వివరించారు. ఈ సందర్భంగా డా. కె. లక్ష్మీకళ మాట్లాడుతూ నర్సరీలలో ఉపయోగించే వివిధ రకాల మీడియా గురించి రైతులకు విపులంగా వివరించారు. ముఖ్యంగా విత్తనాలు మొలకెత్తడానికి, మొక్కల పెరుగుదలకు అనుకూలమైన మట్టిమిశ్రమాలు, కోకోపీట్, వెర్మికంపోస్ట్, ఎరువు మిశ్రమాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. సరైన మీడియా ఎంపిక చేయడం ద్వారా మొక్కల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా నాణ్యమైన నాట్లు తయారుచేయవచ్చని ఆమె తెలియజేశారు. అదేవిధంగా ఉద్యాన పంటలలో అనుసరించే వివిధ రకాల ప్రవర్ధన పద్ధతులు గురించి కూడా రైతులకు ఆమె వివరించారు. ముఖ్యంగా విత్తనాల ద్వారా పెంపకం, శాస్త్రీయ పెంపకం పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. శాకీయ పెంపకంలో ఉపయోగించే వివిధ రకాల కత్తిరింపుల సాఫ్ట్‌వుడ్ కట్టింగ్స్, సెమీ హార్డ్‌వుడ్ కట్టింగ్స్, హార్డ్‌వుడ్ కట్టింగ్స్ వంటి వాటి గురించి ఉదాహరణలతో వివరించారు. అలాగే ఉద్యాన పంటలలో ఎక్కువగా అనుసరించే గ్రాఫ్టింగ్ పద్ధతులు గురించి కూడా సమగ్రంగా ఆమె తెలిపారు. ప్రాయోగిక శిక్షణలో భాగంగా డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుండి మాస్టర్ ట్రైనీ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు వివిధ రకాల గ్రాఫ్టింగ్ పద్ధతులను ప్రదర్శిస్తూ ఆయన వివరించారు. ముఖ్యంగా సాఫ్ట్‌వుడ్ గ్రాఫ్టింగ్, వెనీర్ గ్రాఫ్టింగ్ వంటి పద్ధతులను ప్రత్యక్షంగా చూపించి అవి ఎలా చేయాలో దశలవారీగా వివరించారు. అదేవిధంగా గులాబీలో బడ్డింగ్ పద్ధతిని కూడా రైతులకు ప్రయోగికంగా చూపించారు. ఈ ప్రయోగిక కార్యక్రమంలో రైతులు ఎంతో ఆసక్తితో పాల్గొని స్వయంగా గ్రాఫ్టింగ్, బడ్డింగ్ పద్ధతులను ప్రయత్నించారు. శిక్షణలో పాల్గొన్న రైతులు నర్సరీ స్థాయిలో నాణ్యమైన నాట్ల ఉత్పత్తి చేయడానికి ఈ సాంకేతిక పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమం మొత్తం రైతుల చురుకుగా పాల్గొని విజయవంతంగా చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోపేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు



**గన్నవరం, మార్చి 10, మేజర్ న్యూస్ :** మహారాష్ట్రలోని చారిత్రాత్మక కోపేశ్వర దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సందర్శించారు. 12వ శతాబ్దపు అద్భుత శిల్పకళా వైభవానికి నిలయమైన ఈ క్షేత్రంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా నది తీరాన వెలసిన ఈ ప్రాచీన ఆలయ విశిష్టతను, అక్కడి వాస్తు శిల్ప చాతుర్యాన్ని వారు ఈ సందర్భంగా ఆసక్తిగా తిలకించారు. శివుడు కోపంతో ఉన్న సమయంలో ఇక్కడ వెలిశాడని పురాణ గాథలు చెబుతుండటంతో ఈ ఆలయానికి కోపేశ్వర స్వామి ఆలయంగా పేరు వచ్చింది. ఈ దేవాలయంలోని స్వర్గ మండపం, సభామండపం, గర్భాలయంలోని శిల్పకళా నైపుణ్యం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా పైకప్పు లేని స్వర్గ మండపంలోని 48 స్తంభాలపై చెక్కిన సూక్ష్మ శిల్పాలు నాటి కళాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయి. ఆలయ ప్రాంగణమంతా కలియతిరిగిన వెంకట్రావు దంపతులు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే ఈ కట్టడాల పరిరక్షణ ఆవశ్యకతను తెలుసుకున్నారు.

## బాలికలు హెచ్.పీ.వీ వ్యాక్సిన్ చేయించుకోవాలి



**కోడూరు మేజర్ న్యూస్ :** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రతి బాలిక హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్.పీ.వీ) వ్యాక్సిన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మంగళవారం కోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 14-15 ఏళ్ల బాలికలకు చేపట్టిన హెచ్.పీ.వీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. బాలికకు హెచ్.పీ.వీ వ్యాక్సిన్ చేయించారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి బాలిక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధి కారి పెనుమూడి సాయిబాబు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, వైద్యాధికారిణి డాక్టర్ రాణి సంయుక్త, సీహెచ్ఓ ఎం.లీల, హెల్త్ అసిస్టెంట్ అప్పికట్ల తారక మస్తాన్, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడూరు అక్రమ తూములు తొలగించాలని విన్నపం



**కోడూరు మేజర్ న్యూస్:** కోడూరు మండలం ఇరాలి గ్రామ సమీపంలో రత్నకోడు మేజర్ డ్రెనుకు ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన అక్రమ తూములను వెంటనే తొలగించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు, మంగళవారం కోడూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు, అలాగే, 22ఎ నిషేధిత భూములపై ప్రభుత్వం జారీ చేసిన జీవోలను క్షేత్రస్థాయిలో అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999